# ఏనాటి చుట్టరికమో!

గౌరయ్యకి ప్రత్యేకంగా ఆస్తి అంటూ ఏదీ లేదు. ఏదో తన జానెడు పొట్టకి సరిపడా ఓ ఇన్ని తిండిగింజలు పండుతాయి. అవి చాలవా అనిపిస్తుంది. కానీ పై ఖర్చుకో? ఓ కూరముక్క కావాలన్నా ఉండాలా?

తను నివసిస్తున్నది పల్లెటూళ్లో కాబట్టి ఎవరి గుడ్డిమీద పండిన కూరగాయలైనా ఓ ఇన్ని ఇస్తారు. అయితే మరి చుట్ట ముక్కకో! చుట్టల్ని మాత్రం గౌరయ్య అతిగాను, మితిమీరి కాలుస్తాడు. ఆ అలవాటుని మాత్రం తను మానుకోలేకపోతున్నాడు. తనే ఏమిటి? ఎవరూ మానలేరు! 'ఓల్డ్ హేబిట్స్ డై హార్డ్' అనే సూక్తి ఉండనే ఉంది. అసలెందుకు మానాలి? 'సిగరెట్ స్మోకింగ్ ఈజ్ ఇన్‌జూరియస్‌టు హెల్త్' అనే చట్టబద్ధమైన హెచ్చరిక ఉంది కానీ, చుట్ట కానీ, బీడి కానీ కాల్చకూడదని ఉందా?

అంచేత గౌరయ్య తెల్లవారగానే చుట్ట ముట్టిస్తాడు. 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' అని మహాకవి గురజాడ అన్నట్లు అప్పుడప్పుడూ ఆ పల్లెటూళ్లో నిరుద్యోగ పట్టభద్రులైన యువకులు అంటూండగా విన్నాడు. వచ్చే జన్మలో దున్నపోతు బతుగా? అయ్ బాబోయ్! బళ్లకి కట్టి బరువులు మోయిస్తారు. పొలం దున్నిస్తారు. సరిగ్గా గడ్డి వెయ్యక డొక్క మాడుస్తారు. తన కష్టాన్ని యజమానికి మొరపెట్టుకుందామన్నా నోరూ వాయీ లేని మూగజీవాయె! కనుక తనిప్పుడు చుట్ట కాల్చక తప్పదు. చిన్నప్పుడే వాళ్ల అయ్య నుండి తనకిది సంక్రమించింది. "ఒరయ్యో! కసింత ఈ సుట్టకి అగ్గెట్టుకు రారా!" అని పురమాయిస్తే, అది ముట్టించినప్పుడు ఆరిపోకుండా కొంచెం దమ్ము కొట్టగానే అంటుకునేది. ఆ చెడ్డ అలవాటు తనకిప్పుడు అంటుకుంది! తనకీ, చుట్టకీ ఉన్న 'చుట్ట'రికం ఏనాటిదో?

ఇప్పుడు పై ఖర్చుకి అంటే చుట్టముక్కలు కొనుక్కుందికి మార్గం ఏమిటా అని ఆలోచించాడు గౌరయ్య. కానీ దారీ తెన్నూ అవుపడలేదు. వ్యాపారం చేద్దామన్నా వీల్లేని పరిస్థితి. వ్యాపారానికి ముందు మదుపుండాలి. ఆ మదుపుతో ఏవైనా వస్తువులు మార్కెట్‌లో కొని, చిల్లర వర్తకం చెయ్యాలి. ఎందుకీ ఊకదంపుడు ఆలోచనలు? ముందు అసలో? అసల్లేనిదే పైసలు బేరం ఏమిటి? అనుకున్నాడు గౌరయ్య.

దీర్ఘంగా ఆలోచించాడు. ఉదయాన్నే మాజీ మునసబు ఇచ్చిన చుట్టముక్కకి నిప్పంటించాడు. ఏమీ పాలుపోలేదు. బుర్రని వేలితో టకటకమని కొట్టుకున్నాడు. చేతిలో ఉన్న దుడ్డుకర్రని మెల్లిగా, బియ్యం దంచుతున్నట్లు ఎత్తుతూ దించుతూ శబ్దం చేస్తున్నాడు.

నిటారుగా నిల్చుని ఉన్న గౌరయ్యని హఠాత్తుగా తోసి, కడుపులో రాసి,

దూసుకుపోయి, గొప్ప ఆలోచనా సముద్రంలో మునిగిన గౌరయ్యను అకస్మాత్తుగా స్పృహలోకి తెచ్చింది అతని కుంటి ఆవు.

"ఛా! ఎదవకానా! నువ్వుండీ ఉద్ధరించేదీ లేదు, చచ్చేదీ లేదు! పొలంలోంచి తెచ్చిన గడ్డి పరకలు రెండూ నమిలేస్తున్నావ్! గిద్దెడు పాలైనా ఇచ్చిన పాపాన పోవు. మంచి ఆలోసన బుర్రలో దూరినప్పుడే నన్ను దూసి ఇంట్లో దూరావు. ఇంక'నే నాలోసించేదేటి నా నెత్తి?" అని ఆ కుంటి ఆవుని నానా తిట్లూ తిట్టుకున్నాడు గౌరయ్య.

గౌరయ్య ఇంకా దీర్ఘంగా ఆలోచించాడు. తన కుంటి ఆవు తనకి అడ్డు తగలడమే మంచిదనుకున్నాడు. ఇంతసేపూ తన ఆస్తిపాస్తుల గురించి తలుచుకున్నాడు కానీ, తనకి ఓ ఆవు అనేది ఉందనే విషయమే మరచిపోయాడు. మూర్ఖుడు! చుట్టలు కొనుక్కుందికి ఏ వస్తువు అమ్మడమా అని ఆలోచిస్తే ఆ ప్రశ్నకు సరైన సమాధానమే దొరికింది. దాన్ని అమ్మేయడమే భేషైన పని!

గౌరయ్యకి ఆవుని అమ్మేద్దామన్న బుద్ధి కలగజేసినందుకు ఆ గోమాతని ఎంతైనా అభినందించాలి!

అదృష్టవశాత్తూ గౌరయ్యకి పొద్దున్న చుట్టముక్క ఇచ్చిన మాజీ మునసబు అవుపించి "ఏమిటి గౌరయ్యా ఆలోచిస్తున్నావు?" అనడిగాడు.

"మరేటుంది బాబూ! ఎప్పుడూ సుట్టముక్కకైనా పైసా లేనోణ్నయ్యాను. ఇంకెన్నాళ్లిలా మిమ్మల్నీ మిమ్మల్నీ ముస్టెత్తడం అని...."

"సరి సరి ఏంవుందీ? ఆ ఉన్న కుంటి వెధవ ఆవుని సంతలో అమ్మి పారేద్దూ! దీనికింత ఆలోచనేమిటి గౌరయ్యా! గుర్రం గుడ్డిదైనా దాణాకి లోటులేదని, వెధవ గొడ్డు పొలంలో ఉన్నగడ్డినంతా క్షణంలో గుక్క తిప్పకుండా గుటుక్కుమని మేసేస్తుంది పోనీ, మేస్తే మేసిందయ్యా! ఓ ఇన్ని పాలచుక్క లివ్వొచ్చు కదా! గడ్డి తిన్న ఆవులు బలుస్తాయి. అబ్బే! ఇది అలా కాదే! బక్కచిక్కుతూండడం దీని లక్షణం! అంచేత రేపు శనివారం మానాపురం సంతలో అమ్మిపారేయ్" అని ఉచిత సలహా పారేసి, చకచకా పోయారు మాజీ మునసబుగారు.

⊗⊗⊗

మానాపురంలో సంత హడావుడి ఎక్కువగా ఉంది. బస్తీవాళ్లు, పల్లెవాళ్లు రకరకాల వస్తువులు కొనడాలు, అమ్మడాలు జరుగుతూనే ఉన్నాయి.

గౌరయ్య తన కుంటి ఆవుని రోడ్డువక్కనే నిలబెట్టాడు. నెత్తిమీదకు సూరీడువచ్చినా, తన ఆవుని ఖరీదు చేయడానికి ఎవరూ రాలేదు.

"ఎవరిదయ్యా ఆవు?" ప్రశ్నించాడొకాయన. తుళ్లిపడ్డాడు గౌరయ్య. ఎవరిని ఆ ప్రశ్నించేది?

తననేనా? గౌరయ్య ఆనందంతోపాటు ఆశ్చర్యమూ చెందాడు. తన ఆవుని కొనే నాథుడు అవుపించాడా అని! అప్పుడే మధ్యాహ్నం పన్నెండు దాటింది. తను ఆ సంతకు చేరిన ఐదు గంటల్లోనూ ఆవుని బేరం చేయటానికి ఎవరూ రాకపోయేసరికి నిరాశా నిస్పృహలకు లోనయ్యాడు. పైగా మిగిలిన ఐదు గంటల్లోనూ తన ఆవుని కొనడానికి

ఎవరైనా వస్తారని నమ్మకమే లేదతనికి.

"నాదేనండీ!" అన్నాడు గౌరయ్య.

"ఎంతకిస్తావ్?

"వెయ్యి రూపాయలండీ!"

"ఈ కుంటిముండకి వెయ్యి రూపాయలా?" అంటూ వెళ్లిపోయాడు ఆ పెద్దమనిషి.

పది హేను గజాల దూరంలో ఉన్న కిళ్లీ కొట్టు దగ్గర చుట్ట వెలగించాడు గౌరయ్య.

ఈ ఆవుని కొనేవాడెవడూ కనపడ్డు. వెధవ గొడ్డు ఎలా దాపురించిందో? ఛస్తూ ఛస్తూ వాళ్ల నాన్న అప్పజెప్పి మరీ చచ్చాడు. అప్పట్నుంచీ శని పట్టుకుంది. ఈ శని అశనిపాతంలా దెబ్బతీస్తోంది. విరగడయ్యే తెన్నూ తోవా కనబడ్డంలేదు. ఛీఛీ! ప్రాణం విసిగిపోతోంది!

ఇంతకీ నేను పూర్వజన్మలో చేసుకున్న పాపం ఇది! వెధవ గొడ్డుని దుడ్డుకర్రతో ఓ బాదు బాదేస్తే తారుమని చచ్చి ఊరుకుంటుంది. తోళ్ల వ్యాపారికిచ్చేయచ్చు అని ఏమేమో ఆలోచించుకుంటున్నాడు గౌరయ్య.

ఏదో మోటారు కారు శబ్దం రయ్‌మని వినబడి గౌరయ్య ఆలోచనలకు బ్రేకు పడిపోయింది.

"అయ్యో! కారు పెమాదం!" గౌరయ్య గట్టిగా అరిచాడు. జనం చుట్టూ మూగారు. తన కుంటి ఆవే ప్రమాదంలో చచ్చిపోయింది!

ఇంతసేపూ 'కుంటి ఎదవ ఆవు' అని తిట్టుకున్న గౌరయ్యే, "అయ్యో, నా తల్లీ!" అని భోరుమన్నాడు అప్రయత్నంగా. "అంత కళ్లు నెత్తికొచ్చి కారు నడపడమేమిటి?"

"అంత చూస్కోకుండా ఏమిటి తూలి రాలిపడిపోడం?" "డ్రైవర్ మందు కొట్టినట్టున్నాడు!" "ఆవు ఖరీదిచ్చుకో తిన్నగా!" .... ఇలా తలో మాటా ఆడుతున్నారు.

కారు యజమాని మాట్లాడలేదు. కిందకు దిగాడు. ఏడుస్తున్న గౌరయ్యను చూసి రెండు వేలు చేతిలో పెట్టాడు. గౌరయ్య కన్నీరు తుడుచుకుంటూ, ఇరవై వంద కాగితాల్నీ తన మొలలో చిక్కంలో దాచుకుని, మళ్లీ మొలలో దోపుకున్నాడు.

⊗⊗⊗

"గౌరయ్యా! ఛాన్సంటే నీదేనయ్యా! ఈ కుంటిముండని వెయ్యి రూపాయలకు అమ్ముదామనుకున్నావ్! ఛస్తే చచ్చింది, రెండు వేలు కొట్టావు కదయ్యా!" అన్నారు తోటి రైతులు.

"నా యావుకేటి లోపమయ్యా! నా తల్లి కామధేనువు. అలాంటి ఆవు ఒకటి సొర్గంలోనూ, రెండోది బూలోకంలో నాకాడా ఉన్నాది! అది సచ్చిపోనాదని నాను బాదపడుతూంటే మజ్జిని మీరేటయ్యా!" అన్నాడు గౌరయ్య మాటమార్చేసి.

20-9-1999

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక